భారీ వర్షం.. అపార నష్టం

- ఆందోళనలో రైతులు
- ప్రాథమిక నివేదిక సిద్ధం



వర్షాలకు దెబ్బతిన్న మినుము, పెసర పంట

జహీరాబాద్ టౌన్: భారీ వర్షాల కారణంగా జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. డివిజన్ పరిధిలోని అత్యధికంగా జహీరాబాద్ మండలంలో పంట నష్టం జరిగింది. పంట పొలాల్లో వర్షం నీరు నిండి ఉన్నందున ప్రాథమికంగా అంచనా వేసి నివేదిక ఇచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. పూర్తి నివేదిక తయారైన తరువాత పంట నష్టం వివరాలు సమగ్రంగా తెలుస్తాయి. జహీరాబాద్ డివిజన్ పరిధిలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో వేసిన పెసర, మినుము, పత్తి, సోయాబీన్, కంది తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జహీరాబాద్ డివిజన్‌లో 2,199 రైతుల పంటలు దెబ్బతిని 4,160 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. జహీరాబాద్ మండలంలో 2243, న్యాలకల్‌లో 1008, కోహీర్‌లో 254, ఝరాసంగంలో 475, మొగుడంపల్లి మండలంలో 180 ఎకరాల్లో అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయి.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయా. కోత దశలో ఉన్న పెసర, మినుము పూర్తిగా దెబ్బతింది. పత్తి పంట కూడా రంగు మారుతోంది. వానలకు పత్తి పూత కాత నేలరాలాయి. సోయాబీన్, కంది పంటలు కూడా దెబ్బతిని తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి

–సతీష్ రైతు, గుంజెట్టి

చీడ పీడల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను ప్రాథమికంగా నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. త్వరలో పూర్తి స్థాయి నివేదికను తయారుచేస్తాం. వర్షాల వల్ల పంటలకు నష్టం జరిగింది. ప్రస్తుతం ఉన్న పంటలో నీరు నిలువ ఉండటం వల్ల చీడపీడల బెడద కూడా పెరుగుతుంది. అందుకని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ అధికారులను సంప్రదించి తగు సూచనలు సలహాలు తీసుకోవాలి.

–భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

దెబ్బతిన్న పంటల పరిశీలన



మునిపల్లి(అందోల్): తాటిపల్లిలో పత్తి పంటలను పరిశీలిస్తున్న అధికారులు



రేజింతల్ గ్రామ శివారులో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ

మునిపల్లి(అందోల్): వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ పరిశీలించారు. సోమవారం మండలంలోని తాటిపల్లి, అంతారం, పిల్లోడి మన్‌సాన్‌పల్లి గ్రామాల రైతుల పత్తి పంటలను పరిశీలించి సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య, రహమాన్, రైతులు పాల్గొన్నారు.

రాయికోడ్(అందోల్): మండలంలోని రాయికోడ్, సిరూర్, దౌల్తాబాద్ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి, మినుము పంటలను సోమవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్, సరిత, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ సారిక పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపాలన్నారు. అనంతరం 3 గ్రాముల ఆక్సిక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి పత్తి వేర్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా కిలో యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్ ఎరువు చల్లాలన్నారు. నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించి ఆర్థిక సహాయం అందేలా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ఏఈఓలు, ఆత్మ సిబ్బంది, రైతులు ఉన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో దెబ్బతిన్న పంటలను ఏఓ అభినాష్ వర్మ పరిశీలించారు. ఏకధాటిగా కురిసిన వర్షాల వల్ల పెసర, మినుము, పత్తి, కంది తదతర పంటలు దెబ్బతిన్నాయి. సోమవారం ఉదయం ఏఓ అభినాష్ వర్మ రైతులతో కలసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో ప్రభుత్వానికి పంపిస్తామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

న్యాల్‌కల్ ఎంపీడీఓగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన రాజశేఖర్ కౌలాస్ రాజకీయ కారణాల వల్ల ఏడాది క్రితం నాగిల్‌గిద్దకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో న్యాల్‌కల్ ఎంపీఓ సురేష్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. తాజాగా రాజశేఖర్‌ను న్యాల్‌కల్ ఎంపీడీఓ నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

ఆ కార్ఖానాపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి గ్రామ శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా నడుస్తున్న కొవ్వు కరిగించే కార్ఖానాను తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు తహసీల్దార్ భూపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొవ్వులు, ఎముకలను కరిగించే కార్ఖానా వల్ల దర్గంధ పూరితమైన వాసన వస్తుందని, ఫలితంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా నడుస్తున్న కార్ఖానను మూసి వేయాలని కోరారు.

బీటీ రోడ్లు నిర్మించాలి



మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి(అందోల్): గ్రామాల లింక్ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి కోరారు. సోమవారం మంత్రి దామోదరను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసినట్లు పేర్కొన్నారు. మునిపల్లి నుంచి సదాశివపేట మండలం చందాపూర్, తాటిపల్లి, మక్త క్యాసారం, మునిపల్లి చౌరస్తా నుంచి బుస్సారెడ్డిపల్లి మీదుగా సింగూర్‌తో పాటు ఆయా గ్రామాలకు లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయమై మంత్రి సానుకులంగా స్పందించినట్లు చెప్పారు. మునిపల్లి గ్రామ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఇస్మాయిల్ పటేల్, మక్సూద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సోమవారం డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. అతి తక్కువ వేతనాలతో ఈఎస్‌ఐలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెల జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, యాదయ్య, సురేష్, సిద్దు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ముర్రుపాలతో పిల్లలకు ఆరోగ్యం



చిన్నారులకు ఆహారాన్ని అందిస్తున్న అనిత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. జహీరాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాలతో కూడిన పౌష్టిక ఆహారం అందిస్తారని తెలిపారు. పిల్లలకు తప్పకుండా ముర్రుపాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో పద్మ, జగదీశ్వరి, అంజమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ భాష దినోత్సవం



వశిష్ట డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ సిద్దారెడ్డి తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు డిగ్రీ కళాశాలలో సోమవారం కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాల, ఆచార్య డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు భాష గొప్పదనం గురించి పలువురు కొనియాడారు. ఆయా కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సిద్దారెడ్డి, హరికుమార్, అస్లాం ఫారోఖీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులను సన్మానించారు.

పోషక విలువలతో కూడిన ఆహారం తినాలి



పోషక మాసం కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ అంజమ్మ తదితరులు

జహీరాబాద్ టౌన్: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఆంగన్‌వాడి సూపర్ వైజర్ అంజమ్మ అన్నారు. పోషక మాసంలో భాగంగా సోమవారం పట్టణంలో అంగన్‌వాడి కేంద్రాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు చిన్నారులు తప్పక పోషక ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు మహిళలు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నారాయణఖేడ్: కమలాపూర్ చెరువు వద్ద పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను సోమవారం కార్పొరేటర్ పుష్ప, ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రధాన రహదారిలో వాహనాలు నిలపకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయకులు వచ్చే మార్గంలో విద్యుత్ తీగలు కిందకు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 11 రోజులు క్రేన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వినాయకులను నిమజ్జనం చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శశికాంత్‌రెడ్డి, ట్రాఫిక్ ఏఎస్‌ఐ మల్లయ్య, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలను పట్టణ సమీపంలోని కమలాపూర్ చెరువులో నిమజ్జనాలు చేస్తుంటారు. ఇందులో భాగంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, శానిటరీ అధికారి శ్రీనివాస్ కమలాపూర్ చెరువును పరిశీలించారు.

వర్షాలతో దెబ్బతిన్న పెసర



దెబ్బతిన్న పెసర పంట

నారాయణఖేడ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలతో పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాధార పంటలను సాగు చేశామని, పంటలు చేతికందే దశలో చేతికి వచ్చిన పెసర, మినుము పంటలు నీటిలో నాని మొలకెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని అనంతసాగర్ శివారులో అంతారం అశోక్‌కు చెందిన వ్యవసాయ భూమిలో నాలుగు ఎకరాల్లో పెసర పంట, ఒక ఎకరంలో మినుము పంట వేయడంతో నీటిపాలైందన్నారు. మండలంలోని అనంతసాగర్, జూకల్, వెంకటాపూర్, తుర్కాపల్లి, ర్యాకల్, పైడిపల్లి, రుద్రారం తదితర గ్రామాల్లో పెసర పంటలకు కొంత నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

సంగారెడ్డి: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అడ్డదారుల్లో ఎమ్మెల్యేలను చేర్చుకోవాలనుకునే దుర్మార్గ బుద్ధి కాంగ్రెస్ పార్టీది అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా ఫిరాయింపులను ప్రోత్సహించారని, హై కోర్టు ఆదేశాలకనుగుణంగా వ్యవహరించి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ ను కోరారు.

బస్సు, లారీ ఢీ.. 25 మందికి గాయాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 25మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మద్దికుంట చౌరస్తా ముంబై జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేష్ గౌడ్ తెలిపిన వివరాల మేరకు.. జహీరాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు మద్దికుంట చౌరస్తా వద్ద ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు 25 మందికి గాయాలయ్యాయి.వీరిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సంగారెడ్డి ఎడ్యుకేషన్ : మాట్లాడుతున్న తారా కళాశాల ప్రిన్సిపాల్ కేవీస్ రత్నప్రసాద్



పటాన్‌చెరు: కాళోజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కాళోజీకి నివాళి

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆయా పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సంగారెడ్డి రూరల్: కాళోజి చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు



నారాయణఖేడ్: నివాళులు అర్పిస్తున్న జ్యోతి బాపూలే గురుకుల అధ్యాపకులు



కల్హేర్(నారాయణఖేడ్): కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్

విఘ్నాలు తొలగించి శుభాలు కలిగించు



నీలం మధుకు వినాయకుడి చిత్రపటాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: ప్రజల సర్వ విఘ్నాలను తొలగించి శుభాలను ప్రసాదించాలని ఖైరతాబాద్ గణనాథుడిని ప్రార్థించినట్లు కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ తెలిపారు. సోమవారం ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణనాథుడి ఆశీస్సులతో ప్రకృతి వైపరీత్యాలు తొలగి ఉభయ తెలుగు రాష్ట్రాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, సభ్యులు వీణ, అమీన్‌పూర్ కౌన్సిలర్ కొల్లూర్ మల్లేష్, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ ఎస్.శంకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు విషయాల వారిగా సామర్థ్యాలను పెంపొందించడానికి కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో నిర్వహించే గ్రంథాలయ నిర్వహణ, తల్లిదండ్రుల సమావేశం, విద్యార్థుల హాజరు శాతం ఎలా పెంపొందించాలో సమావేశంలో చర్చించారు.

సంక్షిప్త వార్తలు

◆ **కల్హేర్ ఎంపీడీఓగా రమేశ్‌బాబు**

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ ఎంపీడీఓగా డి.రమేశ్ బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీఓ శ్రీనివాస్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. డీఆర్‌డీఓలో పనిచేస్తున్న రమేశ్‌బాబును ఎంపీడీఓగా నియమిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన రమేశ్‌బాబును సూపరింటెండెంట్ సంగ్రామ్ సన్మానించారు.

◆ **వినాయక విగ్రహం ఏర్పాటు**

జోగిపేట(అందోల్): అందోల్‌లోని విఠలేశ్వర దేవస్థానంలో సాయి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోనే అతిపెద్ద భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ దేవాలయం 25వ వార్షిక వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా 18 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 11న ఆలయం ఆవరణలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపడతామన్నారు.

◆ **హెచ్‌ఎంలకు అవగాహన**

మునిపల్లి(అందోల్): డైస్‌పై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ దశరథ్ అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రమైన మునిపల్లిలో ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఫర్నిచర్ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరేశ్, నాగభూషణం, భాస్కర్ పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సాయం అందజేత**

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో పోలీస్ హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మొగులయ్య వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. కొన్ని రోజులుగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని సోమవారం ఆలయ ఈఓ శశిధర్ తో పాటు అధికారులు అర్చకులు తమ వంతుగా వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు.

◆ **గోవా మద్యం పట్టివేత**

జహీరాబాద్ టౌన్: గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాష్ట్ర సరిహద్దులో గల మాడ్గి చెక్‌పోస్టు వద్ద సోమవారం పట్టుకున్నారు. మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ లక్ష్మణ్ సింగ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ట్రావెల్ బస్సులో 12 మద్యం బాటిళ్ల లభించాయి.

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 11 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు రూ. 2 వేల చొప్పున జరిమానా విధించింది. శని, ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో వీరు పట్టుకున్నట్లు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ చెప్పారు.

◆ **శంకరభారతి మహారాజ్‌కు సన్మానం**

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని నగర్‌కు చెందిన శంకరభారతి మహారాజ్ సోమవారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి స్వగృహానికి వచ్చారు. ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు.

◆ **ఆలయంలో సప్తాహం**

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేటలోని శ్రీలక్ష్మి అనంతపద్మనాభస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి నుంచి అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. సోమవారం భజన, ప్రవచనం, హరిపాఠ్, కీర్తనలు, హరిజాగరణ, కాకడహారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

◆ **ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం**

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ముత్తంగి చెరువు నుంచి అలుగు పారుతుండడంతో నీరంతా చిట్కుల్ గ్రామ పరిధిలోని రాధమ్మ కాలనీ, నాగార్జున, పార్థసారథి కాలనీలోకి చేరుతోంది. ఈ క్రమంలో సోమవారం ఎంపీఓ హరిశంకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు కాలనీలలో పర్యటించి, అలుగు నుంచి వచ్చే వరద నీరు కాలనీలో రోడ్లపై నిలవకుండా పనులను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముత్తంగి చెరువు నుంచి వచ్చే అలుగునీరు కాలనీలో నిల్వకుండా ఎప్పటికప్పుడు మళ్లిస్తున్నట్లు తెలిపారు.

◆ **ముగిసిన క్రీడోత్సవాలు**

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడోత్సవాలు సోమవారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో అండర్ 14, అండర్ 17 వాలీబాల్ మొదటి స్థానం కాసాల, రెండో స్థానం దౌల్తాబాద్, కబడ్డీ అండర్ 14 టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ మొదటి, రెండో స్థానం దౌల్తాబాద్, అండర్ 14 వాలీబాల్ మొదటి స్థానం దౌల్తాబాద్, రెండో స్థానం చింతల్‌చెరు కార్మెల్, కోకో మొదటి స్థానం అండర్ 17 టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ ద్వితీయ స్థానం కాసాల సాధించాయి.

◆ **ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

సంగారెడ్డి టౌన్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనాలు తప్పక పాటించాలని పట్టణ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సోమవారం అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం సందర్భంగా గ్రీన్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ **ఉద్యమకారుడు రాచిరెడ్డికి సన్మానం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కాళోజి జయంతి సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో తెలంగాణ బాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రను పోషించిన ఉద్యమకారుడు నవాబు రాచిరెడ్డిని వికారాబాద్ అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. వికారాబాద్ అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక గౌరవ అధ్యక్షుడు నర్సింలు గుప్తా, సలహాదారులు ఠాకూర్ రాంసింగ్,కవులు మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

◆ **బాధ్యతల స్వీకరణ**

కొండాపూర్(సంగారెడ్డి): కొండాపూర్ ఎంపీడీఓగా సోమవారం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. పుల్‌కల్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. గతంలో కొండాపూర్ ఎంపీడీఓగా పనిచేసిన జ్యోతి లక్ష్మీ నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యింది. దీంతో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న రత్నమాల ఇన్‌చార్జి ఎంపీడీఓగా కొనసాగారు.

◆ **రోడ్డుపై గుంతల పూడ్చివేత**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని వికారాబాద్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను సీఐ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పూడ్చి వేయించారు. సోమవారం రాత్రి టిప్పర్‌తో కంకర సిమెంట్ తెప్పించి గుంతల్లో పోయించారు.

◆ **ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి**

జోగిపేట (అందోల్): కుల, మతాలకతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి, మిలాద్ ఉన్‌నబీ పండగలు జరుపుకోవాలని జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పాండు, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, మండపాల నిర్వహకులు, మైనార్టీ, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.